అద్దంలా ఏయూ రహదారులు



నూక్లియర్ ఫిజిక్స్ వద్ద నిర్మిస్తున్న రహదారి



ఫార్మా టెస్టింగ్ ల్యాబ్ పనులు పరిశీలిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి



సైకాలజీ విభాగానికి వెళ్లే రహదారి ఆధునికీకరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్గత రహదారులు అద్దంలా మెరుస్తున్నాయి. వర్సిటీలోని పలు విభాగాలకు వెళ్లే రోడ్ల ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీంతో వర్సిటీ రహదారులు నూతన శోభతో కళకళలాడుతున్నాయి. దీంతో వాహనదారుల రాకపోకలు సాఫీగా సాగి పోతున్నాయి. కొద్ది రోజులుగా ఏయూలో స్టేట్ బ్యాంక్, నూక్లియర్ ఫిజిక్స్, సైకాలజీ విభాగాలకు వెళ్లే పలు మార్గాల ఆధునికీకరణ పనులు పూర్తి చేసుకున్నాయి. ఈ మేరకు బుధవారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఈ పనుల ప్రగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇంజినీరింగ్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. దీర్ఘ కాలంలో మరమ్మతులకు నోచుకోని అనేక మార్గాలను దశల వారీగా మరమ్మతులు చేపట్టి కొత్తగా రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని వీసీ తెలిపారు. అనంతరం కొత్తగా నిర్మించిన ఫార్మా టెస్టింగ్ ల్యాబ్‌ను ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల ప్రగతిని వీసీకి ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. భవనం చుట్టూ జరుగుతున్న సుందరీకరణ, ల్యాండ్ స్కేపింగ్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. గురువారం ఏయూకు రానున్న అమెరికా ఎఫ్‌డీఏ అధికారులు ఈ భవనాన్ని సందర్శించే అవకాశం ఉంది.

క్లుప్తంగా

ముగిసిన దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి

ఆరిలోవ: హనుమంతవాక వద్ద విజయ దుర్గా కాలనీలోని విజయ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ నెల 20న ప్రారంభమైన ఈ ఉత్సవాలు ముగింపు సందర్భంగా అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు సాయంత్రం అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందులో భాగంగా నిర్వహించిన జాతరలో హనుమంతవాక నుంచి పెదగదిలి వరకు ప్రజలు తరలివచ్చి సందడి చేశారు. మూడు రోజుల పాటు ప్రశాంతంగా ఉత్సవాల నిర్వహణకు సహకరించిన కాలనీవాసులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎంవీపీ కాలనీ: ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని ఎంవీపీ కాలనీ సెక్టార్-3, సెక్టార్-6, అంజయ్యనగర్ ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఎంవీపీ కాలనీ సెక్టార్-6లో 11కేవీ ఫీడర్ నిర్వహణ సర్వీసుల్లో భాగంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కళాభారతిలో రామదాసు జయంతి నేడు

మద్దిలపాలెం: భక్త రామదాసు జయంతి వేడుకలను గురువారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలలో భాగంగా సాయంత్రం 6.30 గంటలకు భక్త రామదాసు కీర్తనల గోష్టి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సుమారు 200 మంది కళాకారులు పాల్గొన్ని గీతాలాపన చేయనున్నారన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు



ఆస్పత్రిలో గాయాలతో సూర్యప్రకాశరావు

భీమునిపట్నం: భీమిలి పెద్దబజారు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద బుధవారం కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ బంకు వద్దకు వేగంగా వచ్చిన కారు అక్కడ పని చేస్తున్న ముళ్లపూడి సూర్యప్రకాశరావు(62)ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని కాలికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఢీకొట్టిన కారు ఆగకుండా వెళ్లిపోవడంతో పోలీసులకు బంక్ నిర్వాహకులు ఫిర్యాదు చేయడంతో వారు దర్యాప్తు చేస్తున్నారు.

సినీ సంగీత విభావరి నేడు

సీతంపేట: ఇటీవల మృతిచెందిన సినీ దిగ్గజాలు కె.విశ్వనాథ్, వాణీ జయరామ్‌లకు స్వర నివాళిగా గురువారం సంగీత సాహిత్య సమలంకృతే శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్టు ఆత్రేయ స్మారక కళా పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి తెలిపారు. గురువారం సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో కె.విశ్వనాథ్, వాణీ జయరామ్‌ల పాటలతో గాయనీ గాయకులు అలరిస్తారన్నారు. గాయనీ గాయకులు కె.రాజేంద్ర ప్రసాద్, రమేష్‌కుమార్ పట్నాయక్, శంబర జోగారావు, వి.కె.రాజు, పి.ఎల్.నాయుడు, సౌజన్య, శైలజ, కల్యాణి, దీప్తి, శృతి, శ్రీవిద్య విశ్వనాథ్, వాణీజయరామ్‌ల హిట్ సాంగ్స్ ఆలపిస్తారని తెలిపారు. ప్రవేశం ఉచితమని సంగీత, సాహిత్య ప్రియులు పాల్గొని జయప్రదం చెయ్యాలని కోరారు.

సీఎం జగన్‌తోనే మత్స్యకారులకు రాజకీయ ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న మూగి శ్రీరామమూర్తి తదితరులు

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే మత్స్యకారులకు రాజకీయ ప్రాధాన్యం లభిస్తుందని తీరప్రాంత వాడబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మూగి శ్రీరామమూర్తి అన్నారు. బుధవారం ఆయన అప్పుఘర్‌లోని సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తొలి నుంచి మత్స్యకారులకు రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. ఇటీవల కేటాయించిన ఎమ్మెల్సీ స్థానాలతో వైఎస్ జగన్ అందిస్తున్న సామాజిక న్యాయం మరోసారి రుజువైందన్నారు. పార్టీకి విశేష సేవలందించిన కోలా గురువులకు ఎమ్మెల్యేల కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం హర్షణీయమన్నారు. అలాగే కాకినాడకు చెందిన కర్రీ పద్మశ్రీకి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికలు ఏవైనా మత్స్యకారులంతా ముఖ్యమంత్రి జగన్ వెంటే ఉంటారని స్పష్టం చేశారు. ఆయా పదవులు కేటాయింపునకు కృషి చేసిన వైఎస్సార్‌సీపీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గుండుపల్లి రామకృష్ణ, కోశాధికారి పేర్ల భాస్కర్‌రావు, వాసుపల్లి వీరబాబు, లండక్ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా శివరామకృష్ణ



నూతనంగా ఎన్నికైన విశాఖ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ కార్యవర్గ సభ్యులు

బీచ్ రోడ్డు: విశాఖ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడిగా శివరామకృష్ణ ఎన్నికయ్యారు. బుధవారం సిరిపురంలోని ఓ హోటల్‌లో సొసైటీ నూతన కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, కోశాధికారిగా వరప్రసాద్, డైరెక్టర్లుగా మరడ పోలిరెడ్డి, అనీల్‌కుమార్, కృష్ణ, అప్పలరాజు, మహేశ్వరరావు, ఈశ్వరరావును ఎన్నుకున్నారు. ఐదేళ్ల పాటు ఈ పాలక మండలి కొనసాగనుంది. ఎన్నికల అధికారిగా సిహెచ్.ఎస్.శ్రీనివాసరావు వ్యవహరించారు.

మాజీ ఎంపీ బొడ్డేపల్లికి ఘన నివాళి



బొడ్డేపల్లి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు రమణికుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు డెయిరీ ఫారం వద్ద బుధవారం మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు వర్ధంతి కార్యక్రమాన్ని శ్రీముఖలింగ కళింగ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి సంఘం సభ్యులతో కలసి రాజగోపాలరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎంపీగా బొడ్డేపల్లి ఉత్తరాంధ్రకు చేసిన సేవలను కొనియాడారు. కళింగ కులస్తులను బీసీలలో చేర్చడానికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పి.శ్రీను, కొండలరావు, సంఘం అధ్యక్షుడు నంబాల అప్పారావు, వైస్ ప్రెసిడెంట్ మామిడి కన్నారావు, సభ్యులు పాల్గొన్నారు.


చదువుపై శ్రద్ధ అవసరం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

కొమ్మాది: ప్రస్తుతం అన్ని తరగతుల విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్నందున ప్రతి ఒక్కరూ చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. బుధవారం ఆమె జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటలో గల జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలని, వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా చదువులో కాస్త వెనుకబడిన విద్యార్థులపై పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అనంతరం నాడు – నేడు పనుల పురోగతిపై సమీక్షించారు.

విరబూసిన రాఖీ, కాక్టస్ పుష్పాలు



కాక్టస్ పుష్పం



రాఖీ పుష్పం

ఏయూ క్యాంపస్: ప్రకృతి ఉద్యానవనంలో అరుదైన పుష్పాలు విరబూశాయి. ఎడారి ప్రాంతాలలో కనిపించే కాక్టస్ జాతికి చెందిన పుష్పం పెదవాల్తేరులోని జీవ వైవిధ్య ఉద్యాన వనంలో కనువిందు చేసింది. ఆస్ట్రోఫైటమ్ ఆస్టెరియాస్ జాతికి చెందిన సీర్సిస్ కాక్టస్ మొక్క తెల్లని రేకలతో ఎంతో అందంగా కనిపిస్తోంది. – అలాగే తీగజాతిలో కనువిందు చేసే పాసిఫ్లోరేసియా కుటుంబానికి చెందిన పర్పుల్ ఫ్యాషన్ ఫ్లవర్‌లు విరబూశాయి. వీటిని రాఖీ ఫ్లవర్‌గా, ఫ్రెండ్‌షిప్ ఫ్లవర్‌గా, మేపాస్ ఫ్లవర్‌గా వివిధ పేర్లతో పిలుస్తారు. ఈ పుష్పాలు జీవ వైవిధ్య ఉద్యానవనంలో సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆనందపురం : మండలంలోని తర్లువాడ వద్ద టోల్ గేట్ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ శ్యామ్ సుందర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జాతీయ రహదారి డివైడర్ మధ్యలో మృతదేహం ఉన్నట్టు కొంత మంది స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఎస్ఐ శ్యామ్ సుందర్ సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మృతుడు నీలి రంగు టీషర్ట్, ఎరుపు రంగు డిజైన్ కలిగిన నిక్కరు వేసుకొని ఉన్నాడని, సుమారు 45 ఏళ్ల వయస్సు ఉండొచ్చని పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 73822 96908 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ శ్యామ్ సుందర్ కోరారు.

బీచ్‌లో ఫోన్ల చోరీ



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పర్యాటకులు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్‌లో రెండు ఫోన్లు చోరీకి గురయ్యాయి. మెరైన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం సాయంత్రం ఇక్కడి బీచ్‌లో గడిపేందుకు ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆరుగురు యువతీ యువకులు చేరుకున్నారు. కాసేపు స్నేహితులతో సరదాగా గడిపి బీచ్‌లో స్నానాలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో వారి వెంట తెచ్చుకున్న బ్యాగులు, సెల్ ఫోన్లను కాస్త దూరంలో పెట్టారు. వీరు స్నానాలు చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు బ్యాగుల్లోని రెండు సెల్‌ఫోన్లతో పాటు రూ.3 వేల నగదు, ఏటీఎం కార్డులు తీసుకుని పోయినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాతృభాషతోనే విజ్ఞానాభివృద్ధి

- ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత
- ముగిసిన మాతృభాషా దినోత్సవం అంతర్జాతీయ సదస్సు



రెక్టార్ ఆచార్య సమతని సత్కరిస్తున్న నిర్వాహకులు

ఏయూ క్యాంపస్: మాతృభాషతోనే విజ్ఞానాభివృద్ధి సాధ్యమని, అందులో ఉన్న మాధుర్యాన్ని విద్యార్థులు గ్రహించాలని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. ఏయూ టీఎల్ఎన్ సభాహాల్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం–తెలుగు ప్రాశస్త్యం అనే అంశంపై జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా రెక్టార్ సమత మాట్లాడుతూ మన తెలుగు భాష చాలా గొప్పదని, ఆనాటి మహాకవుల కావ్యాలలో విలక్షణమైన పదజాలాలు ప్రయోగించారని గుర్తు చేశారు. విద్యార్థి దశ ఎంతో ముఖ్యమైనదని, ఈ సమయంలో విద్యార్థులు సులభంగా ఏ భాషనైనా నేర్చుకునే శక్తి ఉంటుందని చెప్పారు. మాతృభాషను ప్రేమిస్తూనే ఇతర భాషలను గౌరవిస్తూ అభ్యసించాలని సూచించారు. గౌరవ అతిథిగా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు మాట్లాడుతూ సదస్సులు జరిగినప్పుడే తెలుగు భాష గురించి మాట్లాడడం సరికాదని, నిరంతరం భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. ఆంగ్ల, హిందీ భాషలో ఉన్న పాఠ్య పుస్తకాలను మన మాతృభాషయైన తెలుగులోకి తర్జుమా చేసే నైపుణ్యం గల ఆచార్యులను నియమించే పనిలో ఉన్నామని చెప్పారు. విశిష్ట అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యుడు కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సామెతలు, పొడుపు కథలు, నుడికారాలు విరివిగా నేర్చుకుంటే భాషపై పట్టుసాధించగలరని చెప్పారు. వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ అమ్మ వంటి కమ్మని భాషను మరవకూడదని కోరారు. సదస్సు నివేదిక అందించిన డాక్టర్ బూసి వెంకటస్వామి మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి 222 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు విచ్చేశారని, 72 పరిశోధన పత్రాలు సమర్పించారని తెలిపారు. ఈ సమావేశానికి తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జి.యోహానుబాబు, ఆచార్య అన్నంశెట్టి ఈశ్వరమ్మ, ఆతుకూరి వెంకటేశ్వర్లు, తెలుగు విభాగ ఆచార్యులు వెలమల సిమ్మన్న, డాక్టర్ అయ్యంగారి సీతారత్నం, డాక్టర్ కట్టెపోగు రత్నశేఖర్, డాక్టర్ పెండ్యాల లావణ్య, తదితరులు పాల్గొన్నారు. అతిథులకు సన్మానం చేశారు. పత్ర సమర్పకులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

ఏయూ సమాచారమ్

గాంధేయ విలువలతో సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధన



రోషిణికి గాంధీజీ పుస్తకాలను బహూకరిస్తున్న చల్లా రామకృష్ణ

ఏయూ క్యాంపస్: సుస్థిర ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధి సాధనకు గాంధేయ విలువలు, విధానాలు అవసరమని విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి కొరటి అన్నారు. బుధవారం ఆంధ్రా యూనివర్సిటీ గాంధీయన్ స్టడీస్ సెంటర్‌ను ఆమె సందర్శించారు. సాంఘిక సంక్షేమంపై గాంధేయ ఆలోచనలు ఆమోదించిన స్వదేశీ మార్కెట్‌లు సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని రోషిణి చెప్పారు. సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చల్లా రామకృష్ణ గాంధీజీ పుస్తకాలను ఆమెకు బహూకరించారు. కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.


గ్లోబల్ లీడర్స్‌గా ఎదగాలి



నవీందర్‌ను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: యువతరం గ్లోబల్ లీడర్స్‌గా ఎదగాలని లండన్‌కు చెందిన మేనేజ్‌మెంట్ నిపుణుడు నవీందర్ ఆకాంక్షించారు. బుధవారం ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, ఎంబీఏ విద్యార్థులను ఉద్దేశించి కన్సల్టింగ్ సర్వీసెస్‌కు అవసరమైన నైపుణ్యాలపై ఆయన ప్రత్యేక అతిథి ప్రసంగం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా విభిన్న దేశాలలో తాను అందిస్తున్న కన్సల్టింగ్ సేవలు, విధి విధానాలు, పనితీరు, ప్రగతి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సాధారణ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలతో పాటు, ఐటీ ఆధారిత సేవలు, ఆర్థిక సేవలు అందించే అంశాలపై కార్యాచరణ రూపొందించుకుని పని చేయడంపై వివరించారు. ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకు ఉందన్నారు. ఏయూ జియోఫిజిక్స్ ఆచార్యుడు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎంబీఏ చేసిన నవీందర్ కప్లిష్ ఏయూ విద్యార్థులకు పలు అంశాల్లో దిశానిర్దేశం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని నవీందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఏయూ విద్యార్థులకు నూతన జ్ఞానాన్ని అందించే దిశగా సహకారం అందించాలని వీసీ కోరారు. వర్సిటీతో కలసి పని చేయాలని సూచించారు. వర్సిటీ తరఫున నవీందర్‌ను సత్కరించారు.

అఫీషియల్ స్టాటస్టిక్స్‌పై ఒక రోజు వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న జి.ఎస్.లక్ష్మి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ సైన్స్–టెక్నాలజీ స్టాటిస్టిక్స్ విభాగం, జనాభా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'అఫీషియల్ స్టాటస్టిక్స్ విత్ స్పెషల్ ఎంఫసిస్ ఆన్ ఇండస్ట్రియల్ స్టాటస్టిక్స్'అనే అంశంపై బుధవారం ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. విద్యార్థులకు రెండు సెషన్స్‌గా నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్(ఐ) అధికారి, మాజీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ జి.ఎస్.లక్ష్మి మాట్లాడుతూ అఫీషియల్ స్టాటస్టిక్స్ ప్రాముఖ్యత, వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో వాటి వినియోగం, ఉద్యోగావకాశాలు, పరిధి, పరిమితులు, అవరోధాలను విద్యార్థులకు వివరించారు. భారత సాంఖ్యాక శాస్త్ర మంత్రిత్వ శాఖ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్, నేషనల్ స్టాటిస్టికల్ కమిషన్ సంస్థల నిర్మాణాత్మక విధానం, వీటిలోని ప్రధాన విభాగాలు, వాటి విధులు, ఇండికేటర్స్, విజన్–2024, అంతర్జాతీయ స్థాయిలో అఫీషియల్ స్టాటస్టిక్స్ పాత్రను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విభాగాధిపతి ఆచార్య బి.మునిస్వామి సమన్వయకర్తగా వ్యవహరించారు.

సచివాలయ ఉద్యోగుల డెమోక్రటిక్ అసోసియేషన్ కార్యవర్గం



సచివాలయ ఉద్యోగుల డెమోక్రటిక్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు

మద్దిలపాలెం: సచివాలయ ఉద్యోగుల డెమోక్రటిక్ అసోసియేషన్ విశాఖ జిల్లా కార్యవర్గం ఎన్నిక బుధవారం ఇసుకతోటలో జరిగింది. అసోసియేషన్ వ్యవస్థాపకుడు పి.శామ్యూల్, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.నూతన్ కుమార్‌రెడ్డిల సమక్షంలో జరిగిన ఎన్నికలలో జిల్లా అధ్యక్షుడిగా డి.ఎ.సూర్య, కార్యదర్శిగా బంగారు నాయుడు, ఉపాధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్, జాయింట్ కార్యదర్శిగా కె.కృష్ణవేణి, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా సిహెచ్.నాయుడు, కార్యవర్గ సభ్యులుగా డి.బుల్లిబాబు, ఆర్.లక్ష్మి, పి.అప్పారావు, వై.వెంకటరావు, మీనా భూషణ్, నవీన్‌కుమార్, ప్రియా ఎన్నికయ్యారు.

పాడి రైతుల ఆదాయం పెంపునకు కృషి



మాట్లాడుతున్న స్మైల్ అడిషనల్ డైరెక్టర్ సింహాచలం

ఆరిలోవ (విశాఖ తూర్పు): పాడి పశువుల ఉత్పాదకత పెంపుదలకు కృషి జరుగుతోందని రాష్ట్ర పశుగణ వ్యవస్థాపకత యాజమాన్య సంస్థ (స్మైల్) అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ యాండ్రపు సింహాచలం తెలిపారు. విమ్స్ సమీపంలోని రాష్ట్ర స్మైల్ కార్యాలయంలో అన్ని జిల్లాలలో ఉన్న వెటర్నర్ అసిస్టెంట్ సర్జన్‌లకు మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ బుధవారం ముగిసింది. ఈ శిక్షణలో రోజుకు 35 నుంచి 40 మంది వరకు పశు వైద్యులకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇచ్చారు. పాడి పశువులకు ఆధునిక పోషణ పద్ధతులు, వాటి ఆరోగ్యం, పాల ఉత్పత్తి పెంచడం, పాడి రైతులకు ఆదాయం పెంచే చర్యలు తదితర అంశాలను అధికారులు వివరించారు. దీంతో పాటు పశు వైద్యులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్మైల్ అదనపు డైరెక్టర్ సింహాచలం మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇంతవరకు ఇక్కడ 1,117 మంది పశు వైద్యులకు, 80 మంది సన్న జీవాల వ్యవస్థాపకులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. విశాఖ, కాకినాడ, గుంటూరు, కర్నూలు, తిరుపతి, అనంతపురం ప్రాంతీయ శిక్షణ కేంద్రాలలో వైద్యులకు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణలో తెలుసుకొన్న అంశాలు, ఆధునిక పద్ధతులను గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పాడి రైతులు డెయిరీ ఫారాలు ఏర్పాటు చేసుకోవడానికి, డెయిరీలలో ఎక్కువ సంఖ్యలో పశువులు ఉండే విధంగా ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. పాల ఉత్పత్తి పెంచే విధంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రైతులకు ప్రోటీన్‌లతో కూడిన దానా అందించే చర్యలు చేపడుతున్నామన్నారు. ముగింపు కార్యక్రమంలో పశు వైద్యాధికారులు మురళీధర్, చక్రవర్తి, రమణయ్య, సుధాకర్, ప్రసాదరావు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, చలపతిరావు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.